## తెలంగాణ హైకోర్టులో వాదనలు వినిపిస్తూ
# కుప్పకూలిన న్యాయవాది



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టులో విషాద ఘటన చోటు చేసుకుంది. కోర్టు హాలులో న్యాయవాది కుప్పకూలిన ఘటన తోటి న్యాయవాదులను కలచివేసింది. వివరాల్లోకి వెళితే.. న్యాయవాది వేణుగోపాలరావు 21వ కోర్టు హాలులో ఓ కేసుకు సంబంధించి వాదనలు వినిపిస్తున్న సమయంలో ఒక్కసారిగా కూప్పకూలారు. గమనించిన తోటి న్యాయవాదులు వెంటనే అతన్ని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వేణుగోపాలరావు గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. న్యాయవాది మృతికి సంతాప సూచకంగా 21వ కోర్టులో పిటిషన్ల విచారణను న్యాయమూర్తి నిలిపివేశారు. మిగతా కోర్టుల్లోనూ అత్యవసర పిటిషన్లు, పాస్ ఓవర్ పిటిషన్లను విచారించి.. రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశారు.

### యూపీఎస్సీ సివిల్స్‌కు
## దరఖాస్తుల గడువు మరోసారి పొడిగింపు

**ఢిల్లీ:** సివిల్ సర్వీసెస్ పరీక్ష దరఖాస్తుల గడువును యూపీఎస్సీమరోసారి పొడిగించింది. అఖిల భారత సర్వీసుల్లో దాదాపు 979 పోస్టుల భర్తీ కోసం అభ్యర్థులు ఫిబ్రవరి 21వరకు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. సివిల్ సర్వీస్ ఎగ్జామినేషన్ 2025 పరీక్షకు గత నెలలో నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. జనవరి 22న మొదలైన దరఖాస్తుల ప్రక్రియ తొలుత ఫిబ్రవరి 11తో ముగియగా.. అధికారులు ఆ గడువును 18వ తేదీ వరకు పొడిగించారు. ఆ గడువు సైతం నేటితో ముగియడంతో ఫిబ్రవరి 21వరకు మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. తాజా నిర్ణయంతో అభ్యర్థులు ఫిబ్రవరి 22వ తేదీ సాయంత్రం 6గంటల వరకు అప్లై చేసుకోవచ్చు. దరఖాస్తుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు సవరించుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు యూపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. మరోవైపు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో మరో 150 పోస్టులకు సైతం దరఖాస్తుల గడువును ఫిబ్రవరి 21 వరకు పొడిగించారు. అభ్యర్థులు ఆఖరి నిమిషం వరకు ఎదురుచూడకుండా ముందుగానే దరఖాస్తులు చేసుకోవాలని యూపీఎస్సీ సూచించింది.

## మరో ఐదు జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన బీజేపీ

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో బీజేపీ మరో ఐదు జిల్లాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను కూడా నియమించింది. మొత్తం మూడు విడతల్లో 28 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన పార్టీ అధిష్ఠానం.. మరో 10 జిల్లాలకు అధ్యక్షులను పెండింగ్‌లో పెట్టింది. భాజపాకు సంస్థాగతంగా తెలంగాణలో 38 జిల్లాలు ఉన్నాయి. నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా కె.సత్యయాదవ్, సూర్యపేట శ్రీలతరెడ్డి, సిద్దిపేట బైరి శంకర్ ముదిరాజ్, సిరిసిల్ల ఆర్.గోపి ముదిరాజ్ నియమితులయ్యారు.

### గ్జితివీవ్స్‌లో పట్టు చీరల కలెక్షన్స్‌ను
## ఆవిష్కరించిన ప్రియాంక అరుల్ మోహన్




**విశ్వంభర, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లో గల గ్జితివీవ్స్ వారు తమ గ్రాండ్ పట్టు చీర కలెక్షన్‌ని హీరోయిన్ ప్రియాంక అరుల్ మోహన్‌తో పాటు గ్జితి మేనేజింగ్ డైరెక్టర్లు సౌజన్య, బాబీ తిక్క, టి.శ్రీనివాస్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రియాంక అరుల్ మోహన్ మాట్లాడుతూ.. "చీరలు భారతీయ సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్నాయి, సంప్రదాయం, గాంభీర్యాన్ని సూచిస్తాయి. ఈ కలెక్షన్స్ చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుంది. చీరలపై వీరికున్న ఫాషన్ వెల కట్ట లేనిది. గ్జితివీవ్స్ లో ఉన్నంత సేపు చీరల ప్రపంచంలో ఉన్నట్లుంది. ఆర్ట్, డిజైన్స్ చాలా బాగున్నాయి. సంక్లిష్టమైన డిజైన్‌లు, చీర ప్రియుల విభిన్న అభిరుచులకు అనుగుణంగా అగ్రశ్రేణి చీరలను అందిస్తాయి. గ్జితి వీవ్స్ అనేది డిజైనర్ చీరలకు ఉత్తమమైన ఎంపిక. మీ ఈవెంట్ ని గ్జితివీవ్స్ స్పెషల్ గా మార్చుతుందని అన్నారు.

అనంతరం గ్జితి మేనేజింగ్ డైరెక్టర్లు సౌజన్య మాట్లాడుతూ.. "గ్జితి వీవ్స్ 2 సంవత్సరాల క్రితం స్థాపించబడింది. ఈ బ్రాండ్ నేటికీ పోషణలో ఉంది. ఇది భారతీయ నేత జానపద కథలు, వారి దేశీయ హస్తకళ, సంస్కృతి, సాంప్రదాయ డిజైన్‌ల నుంచి ప్రేరణ పొందింది. మేము దాని సంక్లిష్టమైన డిజైన్‌ల కోసం బలమైన ఖ్యాతిని సంపాదించాము. మీరు వివాహానికి హాజరైనా లేదా అధికారిక కార్యక్రమానికి హాజరైనా, గ్జితి వీవ్స్ మీ సొగసును మెరుగుపర్చడానికి సరైన వస్త్రాన్ని అందజేస్తుంది, మేము భారతదేశంలోని ప్రతి ప్రాంతం నుంచి చీరలను సేకరిస్తాము" అని అన్నారు.

### మహాకుంభమేళాలో
## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు

**ప్రయాగ్‌రాజ్:** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు పోటెత్తుతున్నారు. జనవరి 13న ప్రారంభం అయిన మహాకుంభమేళా ఫిబ్రవరి 26న ముగియనుంది. ప్రపంచంలో అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం అయిన ఈ కుంభమేళాకు ఇప్పటి వరకు 53 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. సామాన్యులే కాకుండా దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు కూడా కుంభమేళాలో పుణ్య స్నానాలు చేశారు. వీరిలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, మంత్రులే కాకుండా ప్రపంచ కుబేరుడు ముఖేష్ అంబానీవంటి వారు కూడా కుంభమేళా పాల్గొన్నారు.తాజాగా ప్రయాగరాజ్ కుంభమేళా లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా పుణ్య స్నానమాచరించారు. మంగళవారం సాయంత్రం కుటుంబ సమేతంగా త్రివేణి సంగమంలో పవిత్రమైన కుంభమేళా లో స్నానం సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రయాగరాజ్ లో కోట్లాది మంది భక్తుల పుణ్యస్నానాలు.. సనాతన ధర్మం, మన సంస్కృతి, సంప్రదాయాలపై రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణకు ఒక సజీవమైన ఉదాహరణ ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా.. దేశ ప్రజలందరికీ సుఖశాంతులు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించానని ఆయన తెలిపారు.



# రంజాన్ మాసంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

- జీహెచ్‌ఎంసీ, పోలీస్ , వాటర్ వర్క్స్ , ఎలక్ట్రిసిటీ , ఆర్ అండ్ బి ఇతర విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- శాంతి భద్రతల విషయంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి
- రంజాన్ ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం



**విశ్వంభర, హైదరాబాద్ :** మార్చి 2వ తేదీ తేదీ నుండి ప్రారంభమయ్యే రంజాన్ మాసంలో చేయాల్సిన ఏర్పాట్ల పై డా., బి ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆరవ ఫ్లోర్ కాన్ఫరెన్స్ హాల్ లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశంలో రంజాన్ మాసంలో తీసుకోవాల్సిన చర్యల పై దిశా నిర్దేశం చేశారు. జీహెచ్‌ఎంసీ రంజాన్ నెల లో నగరంలో పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. మసీదు ,ఈద్గా ల వద్ద ప్రత్యేక శానిటేషన్ బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీధి దీపాలు మరమత్తులు ,తాత్కాలిక లైట్ ల ఏర్పాటు చేస్తామని జీహెచ్ ఎంసీ కమిషనర్ తెలిపారు. రోడ్ల మరమత్తులు పూర్తి చేస్తామని వెల్లడించారు. మక్కా మసీద్ , రాయల్ మాస్క్ , మిరాలం ఈద్గా వద్ద ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి సమయంలో దోమల నివారణకు జిహెచ్‌ఎంసి ఎంటమాలజీ టీం ద్వారా ఫాగింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మసీదు ల వద్ద ప్లాస్టిక్ కవర్ ల పంపిణీ చేస్తున్నామన్నారు. అన్ని డిపార్ట్మెంట్స్ కలిపి ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులను నియమించి సమన్వయం చేస్తున్నామని తెలిపారు.

వాటర్ వర్క్ మసీదులు , ఈద్గాల వద్ద వాటర్ ప్యాకెట్స్ లో ఏర్పాటు , తాగునీటి అవసరాల దృశ్య ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు. మసీద్ లకు వెళ్లే దారిలో డ్రైనేజీల రిపేర్ పూర్తి చేస్తున్నామని వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తెలిపారు. వేసవికాలం దృశ్య విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రంజాన్ నెలలో మొబైల్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ తగ్గ సప్లై ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మసీదుల వద్ద ఈద్గల వద్ద విద్యుత్ ఎమర్జెన్సీ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మసీదుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు క్యూలైన్ ల కోసం బారికేట్లు ఏర్పాటు చేయడానికి ఆర్ అండ్ బి విభాగం సిద్ధంగా ఉందని అధికారులు వెల్లడించారు. రంజాన్ నెల నేపథ్యంలో ప్రజలకు పాల ఇబ్బందులు లేకుండా ఉండడానికి అవసరాలకు తగిన పాలను సరఫరా చేస్తామని డైరీ అధికారులు తెలిపారు. ముస్లిం ఉద్యోగులకు సాయంత్రం నాలుగు గంటలకే విధులు ముగించేలా ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని జెఏడి అధికారులు తెలిపారు.

రంజాన్ పండగ దృశ్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా షాపింగ్ చేసుకోవడానికి ట్రాఫిక్ ను నియంత్రిస్తూ అర్ధరాత్రి వరకు వీధి వ్యాపారాలు కొనసాగించడానికి అనుమతించాలని పోలీస్ అధికారులను ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు విజ్ఞప్తి చేశారు. రంజాన్ పండుగ దృశ్యం ట్రాఫిక్ పేరుతో ఇబ్బందులు కలిగించకూడదని కోరారు. పండగ రోజు ట్రాఫిక్ మళ్లింపుల పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పండగ దృశ్య ప్రజలకు ఇబ్బందులు కలవకుండా వైద్య అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఈద్గాలు మసీదుల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని నిరంతరం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులకు పండగ నిర్వహించుకోవడానికి సమయానికి రేషన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జిహెచ్‌ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, తెలంగాణ మైనారిటీ వెల్ఫేర్ స్పెషల్ సెక్రటరీ తౌసిఫ్ ఇక్బాల్ , ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు, ఫహీం ఖురేషి మైనార్టీ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ ,తెలంగాణ వక్ఫ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ , హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియబని ,మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబెతుల్లా కొత్వాల్ ,మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ , ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్బిన్ హందాన్ , బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఇలంబర్తి , హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి వివిధ అధికారులు పాల్గొన్నారు.

### రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప..
# స్టేట్ ఫికర్ లేదు : కేటీఆర్




**విశ్వంభర, హైదరాబాద్ :** రేవంత్ రెడ్డికి స్వార్థం తప్ప ఇంకోటి తెలియదు.. రియల్ ఎస్టేట్ తప్ప.. స్టేట్ ఫికర్ లేదు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఆమన్‌గల్‌లో ఏర్పాటు చేసిన రైతు దీక్షలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.అన్నదాతలు, మహిళలు జాగ్రత్తగా, చైతన్యవంతంగా ఉండాలి. నాగర్‌కర్నూల్ జిల్లాలో రుణమాఫీ కాక చందు అనే రైతు బ్యాంక్ ముందు బైక్ కాలబెట్టి నిరసన చెప్పిండు. ఆదిలాబాద్‌లో జాదవ్ రావు అనే రైతు బ్యాంకులోనే ఎండ్రిన్ తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మేడ్చల్‌లో సురేందర్ రెడ్డి అనే రైతు వ్యవసాయ శాఖ కార్యాలయంలోనే సూసైడ్ చేసుకున్నాడు. చివరకు రియల్ ఎస్టేట్ ఏజెంట్ వేణోగోపాల్ రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దరిద్రపు పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు. దయచేసి మళ్లీ మోసపోవద్దు అని కేటీఆర్ సూచించారు.

మళ్లీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి.. ఎకరం, అర ఎకరానికి పైసలు వేస్తుండు. ఒక్క విషయం గుర్తు పెట్టుకోండి.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బాకీ పడ్డది ఒక్కొక్క ఎకరానికి రూ. 17500. మళ్లా నమ్మి మోసపోతే.. మనల్ని ఎవరు కాపాడలేదు. పంచాయతీ ఎన్నికల్లో ఓట్ల కోసం ఇంటికొచ్చే కాంగ్రెస్ నాయకులను గల్లా పట్టి అడగండి.. రైతు బంధు, తులం బంగారం, 2500 ఎక్కడా అని అడగాలి.. స్కూటీలు ఏమైనయ్ అని ప్రశ్నించాలి. స్కూటీలు లేవు కానీ లూటీ మాత్రం బాగా నడుస్తుంది. తుక్కుగూడ నుంచి ఇక్కడి దాకా.. రేవంత్ రెడ్డి ఆయన సోదరులు ఫోర్త్ సిటీ.. ఫ్యూచర్ సిటీ.. ఏఐ సిటీ అని డ్రామా చేస్తుండ్రు. వెల్దండ వద్ద రేవంత్ కుటుంబానికి 500 ఎకరాలు ఉండే. మళ్లా 1000 ఎకరాలు సంపాదించిండు. మళ్లీ కొత్త కథ పెట్టిండు.. అత్తగారి ఊరికి కొత్త రోడ్డు వేసుకుంటడ. 1200 ఎకరాల రేట్లు పెంచుకునేందుకు కథలు పడుతుండు రేవంత్ రెడ్డి.. ఆయనకు స్వార్థం, తప్ప ఇంకోటి తెలియదు. రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ ఫికర్ లేదు. ఇలాంటి రేవంత్ రెడ్డిని అసలు నమ్మకండి అని కేటీఆర్ సూచించారు.బిల్లులు రాక సర్పంచ్‌లు ఆగం అవుతున్నారు. వారి గోస పుచ్చుకుంటున్నడు రేవంత్ రెడ్డి. సచివాలయం చుట్టూ తిప్పించుకునంటున్నడు. 600 కోట్ల ఇస్తే అయిపోతది. పాడి రైతులు ఇప్పటి వరకు పైసల్లేవు. మాటలు మాత్రం కోటలు దాటుతున్నయ్ అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు చెరిగారు.

# యూత్ కాంగ్రెస్ పోరాటం మరువలేనిది

### టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్




**విశ్వంభర, హైదరాబాద్ :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనను గద్దె దించడంలో యూత్ కాంగ్రెస్ పోరాటం మరువలేనిదని, ఎంతోమంది కార్యకర్తలు లాఠీ దెబ్బలు తిని జైలుకు వెళ్లి వచ్చారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. మహేశ్వరం లో మూడు రోజుల నుంచి జరుగుతున్న యూత్ కాంగ్రెస్ శిక్షణ శిబిరం ముగింపు వేడుకలకు మంగళవారం మధుయాష్కీ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ప్రతినిధులతో ఇంటరాక్ట్ అయ్యారు. వారు చెప్పిన ఇబ్బందులు, సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మత ప్రాతిపదిక రాజకీయాలు చేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ లను నిలువరించే శక్తి యూత్ కాంగ్రెస్ కు ఉంది అన్నారు. యూత్ కాంగ్రెస్ లో మరింతగా యువతను భాగస్వామ్యం చేయాలని, యువత సమస్యల పట్ల స్పందిస్తూ పని చేస్తూ వారికి కాంగ్రెస్ భావజాలాన్ని వివరించాల్సిన అవసరం ఉందన్నారు. యూత్ కాంగ్రెస్ కు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించేందుకు తాను సీఎం రేవంత్ రెడ్డి , పిసిసి అధ్యక్షులు, ఇతర పెద్దలతోనూ మాట్లాడుతానన్నారు. పొలిటికల్ అఫైర్స్ కమిటీ లోనూ యూత్ కాంగ్రెస్కు ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై చర్చిస్తానన్నారు. బీఆర్ఎస్ పాలనపై పోరాటంలో ఎంతోమంది కేసులు ఎదుర్కొంటున్నారని.. వాళ్లందరికీ టిపిసిసి లీగల్ సెల్ ద్వారా న్యాయ సహాయం అందించే బాధ్యత తీసుకుంటానన్నారు. జిల్లాలో వారీగా ఎవరెవరుపై కేసులు ఉన్నాయో లిస్టు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలలో, కాంట్రాక్టర్లలో కాంగ్రెస్ కోసం కష్టపడిన వారికి అవకాశాలు కల్పించేలా సీఎం తో మాట్లాడుతానన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ రంగంలో వివిధ సాఫ్ట్వేర్ కంపెనీలు రాష్ట్రంలో నెలకొల్పబడుతున్నాయని.. యూత్ కాంగ్రెస్ నాయకులు చొరవ చూపి యూత్ కాంగ్రెస్ ప్రతినిధులకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. యూత్ కాంగ్రెస్ కిందిస్థాయి నుంచి బలోపేతం చేయాలని.. సోషల్ మీడియాను, టెక్నాలజీని సద్వినియోగం చేసుకొని యువతకు దగ్గర కావాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారందరికీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేషనల్ ఇన్చార్జి సురభి దివేది , యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

# ఖతర్ కింగ్‌తో మోడీ భేటీ..

### ద్వైపాక్షిక సంబంధాలే లక్ష్యంగా చర్చ



**ఢిల్లీ :** ఖతర్, భారత్ మధ్య బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామంగా మార్చాలనే నిర్ణయంపై ఇరు దేశాల ప్రతినిధుల మధ్య చర్చ జరిగింది. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్ లో ప్రధాని నరేంద్ర మోడీ, ఖతర్ ఎమిర్ షేక్ తమిమ్ బిన్ హమద్ అల్ తనీ భేటీ జరిగింది. ఈ ఇద్దరు నాయకులు విస్తృతంగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడి, ఇంధనం, ప్రాంతీయ అంశాలే లక్ష్యంగా భేటీ జరిగింది. స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం గురించి ఇరుపక్షాలు చర్చించారు. అంతే కాకుండా, ఐదు సంవత్సరాలలోపు వాణిజ్యాన్ని 28 బిలియన్ డాలర్లకు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇరువులు నేతలు తెలిపారు.

**ఇంధన భద్రతపై..**

ఇంధన భద్రతను ఎలా విస్తృతం చేయాలనే దానిపై ఇరుదేశాలు దృష్టి సారించినట్లు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేశాయి. సుంకాలు, రెట్టింపు పన్నులు, ఆర్థిక ఎగవేతను నివారించేందుకు ఇరుపక్షాలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపాయి. ద్వైపాక్షిక చర్చలతో పాటు, పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ అంశాలపై కూడా ఇద్దరు నాయకులు చర్చించారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు ఖతర్ ఎమిర్ షేక్ తమిమ్ బిన్ హమద్ అల్‌తని రెండ్రోజుల భారత పర్యటనకు వచ్చాయి. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన చేరుకోగా..మోడీ ఆయనకు స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం రాష్ట్రపతి భవన్ లో ద్రౌపది ముర్ముతో ఖతర్ ఎమిర్ భేటీ అయ్యారు.

### రాజీవ్ ఆరోగ్యశ్రీకి
## సమృద్ధిగా నిధులు కేటాయిస్తాం

### వైద్య, ఆరోగ్య శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ



**విశ్వంభర, హైదరాబాద్ :** పేద, మధ్యతరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్య, ఆరోగ్య శాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన వైద్య, ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశంలో సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు పలు సూచనలు చేశారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వం లో ఈ మూడు విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చి రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని తెలిపారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునికీకరణ చేస్తాం అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కి రానున్న బడ్జెట్లో సమృద్ధిగా నిధులు కేటాయించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం అన్నారు. రానున్న ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆసుపత్రుల నిర్మాణం పనులు పూర్తవుతాయని మంత్రులు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పెద్ద సంఖ్యలో వినియోగించుకునేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రులు ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లాంటోరియంలు నిర్మించే ఆలోచనలో ఉన్నట్టు మంత్రులు తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టియాన చొంగతా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీమ్,ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన హైడ్రా చర్యలు..

### - బతుకమ్మకుంటలో ఉబికివచ్చిన నీరు



**విశ్వంభర, హైదరాబాద్:** మహానగరంలో చెరువుల పునరుద్ధరణకు నడుం బిగించిన హైడ్రా ఆ దిశగా చర్యలను ముమ్మరం చేసింది. అంబర్‌పేటలోని బతుకమ్మకుంటలో పునరుద్ధరణ పనులను మొదలు పెట్టగా.. మోకాలిలోతు తవ్వగానే నీరు ఉబికివచ్చింది. దీంతో హైడ్రా అధికారులతోపాటు స్థానికులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. బతుకమ్మకుంట మళ్లీ ప్రాణం పోసుకుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ పుష్పాలతో స్వాగతించారు. హైడ్రా తవ్వకాల్లో పైపులైన్ పగలడం వల్లే నీరు బయటికి వస్తోందని ప్రచారం జరగ్గా .. జలమండలి అధికారులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఎలాంటి పైపులైన్ లేదని, పూర్తిగా భూగర్భంలో నుంచి వచ్చిన నీళ్లేనని నిర్ధరించారు. సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన బతుకమ్మ కుంట ఆక్రమణల కారణంగా ఐదు ఎకరాలకు కుచించుకుపోయింది. చెరువు పరిరక్షణ కోసం హైడ్రా న్యాయస్థానంలో కూడా పోరాటం చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు ఇచ్చిన ఆధారాలతో ఇటీవల బతుకమ్మకుంట పరిధిని నిర్ధరించారు. హైకోర్టు ఆదేశాలతో హైడ్రా.. చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టింది.

### జేఎన్‌టీయూ వీసీగా
## టీ కిషన్ కుమార్ రెడ్డి నియామకం

**విశ్వంభర, హైదరాబాద్ :** జేఎన్‌టీయూ ఉప కులపతిగా టీ కిషన్ కుమార్ రెడ్డి నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ వీసీగా కిషన్ కుమార్ రెడ్డి.. పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మూడేండ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. జేఎన్‌టీయూ వీసీగా నియమితులైన కిషన్ కుమార్ రెడ్డికి యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.గతేడాది మే 21న ఖాళీ అయిన వర్సిటీ వీసీ పోస్టును భర్తీ చేసేందుకు ప్రభుత్వం పలుమార్లు ప్రయత్నించినా సాంకేతిక కారణాల రీత్యా నియామక ప్రక్రియ రెండుసార్లు వాయిదా పడింది. జనవరి 27న సెర్చ్ కమిటీ సమావేశం జరిగినప్పటికీ, తాజాగా శాసనమండలి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మూడోసారి నియామక ప్రక్రియ నిలిచిపోయినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఎట్టకేలకు జేఎన్‌టీయూకు పూర్తిస్థాయి వీసీని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జేఎన్‌టీయూకు ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్‌గా ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి కొనసాగుతున్నారు.